క్లుప్తంగా

పాఠశాల సమయానికి బస్సు నడిపించాలి

మరికల్: పాఠశాల సమయానికి ఆర్టీసీ బస్సు నడిపించాలని పల్లిగడ్డ బీఆర్ఎస్ నాయకులు హన్మంతు శనివారం ఒక ప్రకటనలో అన్నారు. పల్లిగడ్డ నుంచి విద్యార్థులు నిత్యం మండలంలోని ఉన్నత పాఠశాలకు వెళ్తుంటారని, 9 గంటలకు రావాల్సిన బస్సు విద్యార్థులు వెళ్లిన తర్వాత పదిగంటలకు వస్తుందన్నారు. విద్యార్థుల పాఠశాల సమయానికి బస్సును నడిపించేందుకు ఆర్టీసీ అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

జిల్లా వాలీబాల్ పోటీలకు ఎంపిక



మరికల్: జిల్లా స్థాయిలో జరిగే అండర్ 14లెవల్ వాలీబాల్ పోటీలకు తీలేర్ ప్రాథమికొన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు హెచ్ఎం అనురాధ తెలిపారు. ఎంపికైన విద్యార్థులు చరణ్, సురేష్, రామాజీ, మణెమ్మను ఉపాధ్యాయులు సన్మానించారు. మహబూబ్‌గనర్‌లో త్వరలో జరిగే వాలీబాల్ పోటీలో వీరు పాల్గొంటారని ఆమె తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి షూటింగ్‌బాల్ పోటీలకు..



మక్తల్: నారాయఖేడ్ జిల్లాలో ఈ నెల 3నుంచి 5 వరకు నిర్వహించిన జాతీయస్థాయి షూటింగ్‌బాల్ పోటీలకు గురుకులాల విద్యార్థినులు కౌసల్య, భూమికి, వైష్ణవి, మనుష, ఐశ్వర్య ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ చంద్రకళ తెలిపారు. పోటీలకు ఎంపికైన వారు వచ్చేనెల 27 నుంచి 30 వరకు వెస్ట్ బెంగాల్ కలకత్తాలో జరిగే జాతీయస్థాయి పోటీల్లో పాల్గొనున్నట్లు తెలిపారు. ఈ మేరకు.. శనివారం ఉపాధ్యాయులు ప్రియాంక, శారద, నందిని, బయోలా, భాగ్యమ్మ, తిరుపతమ్మ విద్యార్థులను అభినందించారు.

సహాయ ఫౌండేషన్ రాష్ట్ర కార్యదర్శికి సన్మానం

కృష్ణా: మండలంలోని ముడుమాల్ గ్రామానికి చెందిన తిమ్మయ్య ఇటీవల సహాయ ఫౌండేషన్ రాష్ట్ర సహాయ కార్యదర్శిగా ఎంపిక కావడంతో శనివారం మండల కాంగ్రెస్ నాయకులు ఆయనను సన్మానించారు. ఈ మేరకు.. నాయకులు నర్సింహారెడ్డి మాట్లాడుతూ.. మండల ప్రజలకు సహాయ సహకరాలు అందిస్తుండడంతోనే ఈ రోజు రాష్ట్రస్థాయిలో గుర్తింపు లభించిందన్నారు. ఇలాంటి సేవ కార్యక్రమాలు ఇక ముందు కూడా చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బాల్‌దాస్ వేణుగోపాల్, వాకిటి వాబయ్య, బ్యాగరి మహేష్, కోనింటి కృష్ణా, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

మక్తల్: మండలంలోని మంతన్‌గోడ్ ఉప విద్యుత్ కేంద్రంలో మరమ్మతు వలన ఆదివారం ఉదయం 10గంటల సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ రామకృష్ణ తెలిపారు. రైతులు, గృహ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

దేవాలయాలపై దాడులను అరికట్టాలి



మక్తల్: తెలంగాణ రాష్ట్రంలోని దేవాలయాలపై జరుగుతున్న దాడులను వెంటనే అరికట్టాలని వీహెచ్‌పీ, భజరంగ్ దళ్ నేతలు డిమాండ్ చేశారు. హిందు దేవాలయాలపై జరుగుతున్న దాడులకు నిరసనగా వారు శనివారం పట్టణంలోని వివేకానంద చౌరస్తాలో నిరసన చేపట్టారు. ఈ మేరకు వారు మాట్లాడారు.. ఇస్లామిక్ తీవ్రవాదాన్ని ఖండించారు. రాష్ట్రంలో వరుసగా ఆలయాలపై దాడులు జరుగుతున్న సీఎం రేవంత్, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ కనీసం స్పందించకపోవడం హిందూ వ్యతిరేక శక్తులను ప్రోత్సహించడమేనని విమర్శించారు. అనంతరం తహసీల్దార్ సతీస్‌కుమార్, ఎస్ఐ భాగ్యలక్ష్మిరెడ్డికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సత్యనారాయణ, భీమేష్, భాస్కర్, రాహుల్, మహేష్, అంబ్రేష్, వెంకటేష్, ప్రతాప్‌రెడ్డి, అశోగౌడ్, అనిల్‌గౌడ్, శివరాములు, నర్సింహారెడ్డి, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

చదువుపై ప్రత్యేక దృష్టి సారించాలి

మక్తల్: విద్యార్థుల చదువుపై తల్లిదండ్రులు ప్రత్యేక దృష్టి సారించి వారు క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరయ్యేలా చూడాలని ఎంఈఓ అనిల్‌గౌడ్ అన్నారు. శనివారం శనివారం మండలంలోని రుద్రసముద్రం, సత్యవార్, భూత్పూర్, కొండదొడ్డి, ముష్టిపల్లి ఉన్నత పాఠశాలలో తల్లిదండ్రులతో నిర్వహించిన సమావేశానికి వారు హాజరై మాట్లాడారు.. పాఠశాలల అభివృద్ధి, విద్యార్థుల ప్రగతికి తల్లిదండ్రులు తోడ్పాటునందించాలన్నారు. విద్యార్థులు చదువుపైనే దృష్టి సారించేలా తల్లిదండ్రులు ప్రత్యేక చొరవ తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

మద్దూరు: విద్యార్థులను క్రమం తప్పకుండా బడికి పంపాలని భూనీడ్ ఉన్నత పాఠశాల హెచ్ఎం చెన్న కేశవరెడ్డి విద్యార్థుల తల్లిదండ్రులకు సూచించారు. శనివారం పాఠశాలలో తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. ఈ మేరకు.. ఎఫ్ఏ-2లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులను అభినందించారు. ఎస్ఏ-1 పరీక్షల టైం టేబుల్‌ను వివరించారు. ప్రతి చిన్న విషయానికి విద్యార్థులను బడి మాన్పించొద్దని తల్లిదండ్రలకు సూచించారు. క్రమశిక్షణతో కూడిన విద్యాను అందించడానికి మేము కృషి చేస్తామని వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు భానుప్రకాష్‌రెడ్డి, శివాజీ, నర్సింహులు, రాజగోపాల్, అహ్మద్‌అలీ, వరలక్ష్మి, శ్రీలత, రేణుక, రాణిబాయి, వనజ, కవిత, సీఆర్‌పీ రాజు తదితరులు పాల్గొన్నారు.

కృష్ణా: మండలంలోని కున్సి, ముడుమాల్ గ్రామాల్లోని ప్రాథమిక పాఠశాలలో శనివారం విద్యార్థుల తల్లిదండ్రులతో ఉపాధ్యాయులు పాఠశాల అభివృద్ధిపై ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పిల్లల తల్లిదండ్రులు మాట్లాడుతూ.. విద్యార్థులకు అవసరమయ్యే మౌలిక సౌకర్యాలను కల్పించాలని కోరారు. అదేవిధంగా మధ్యాహ్న భోజనం రుచికరంగా ఉండేవిధంగా చూడాలని, పిల్లల వ్యక్తిగత శుభ్రత, చదువులో వారి సామర్థ్యం తదితర అంశాలపై చర్చించారు. అనంతరం విద్యార్థులు తయారు చేసిన కృత్యాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో ఆ పాఠశాలల హెచ్ఎంలు శేఖర్, నల్లె శివరాజ్, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

మాగనూర్: తల్లిదండ్రులు వారి పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని వారిని ఇంటివద్ద చదివించాలని ఉపాధ్యాయులు అన్నారు. శనివారం కొల్పూర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ మేరకు.. వారు వివిధ అంశాలపై విద్యార్థుల తల్లిదండ్రులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. పరీక్షల సమయంలో విద్యార్థులు ప్రశాంతంగా, ఇంటి వద్ద చదువుకునే చూడాలని సూచించారు. అలాగే పాఠశాల అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.



రుద్రసముద్రంలో మాట్లాడుతున్న ఎంఈఓ అనిల్‌గౌడ్



మద్దూర్‌లో తమ ప్రతిభను ప్రదర్శిస్తున్న విద్యార్థులు



కొల్పూర్ పాఠశాలలో..



కున్సి పాఠశాలలో..

వైద్యకళాశాలలో సౌకర్యాలు కల్పించాలి



మెడికల్ కళాశాలను సందర్శించిన నాయకులు

నారాయణపేట: జిల్లాలో వైద్య కళాశాల ఏర్పాటు చేయడం శుభ పరిణామని సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ డివిజన్ కార్యదర్శి కె.కాశీనాథ్ అన్నారు. శనివారం వైద్య కళాశాలను మాస్‌లైన్ ఆధ్వర్యంలో డివిజన్ బృందం సందర్శించింది. ఈ మేరకు.. మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ రాంకిషన్, కళాశాల సిబ్బందిని కలిశారు. ప్రభుత్వం కల్పించిన వసతులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కళాశాలలో అన్ని సౌకర్యాలు కల్పించి త్వరగా విద్యార్థులకు, ప్రజలకు అధునాతన వైద్య సేవలు అందుబాటులోకి తేవాలని కళాశాల ప్రిన్సిపల్‌ను కోరారు. అనేక మంది రోగులు నారాయణపేట ఆస్పత్రిలో వైద్యం దొరకడం లేదని మహబూబ్‌నగర్, హైదరాబాద్ లాంటి ఆస్పత్రులకు ఎక్కువ మంది పేషెంట్లను రెఫర్ చేస్తున్నట్లు తెలిపారు. ఇకముందు అలా కాకుండా వైద్యం జిల్లా ఆస్పత్రిలో ప్రజలకు దొరికే విధంగా వైద్య కళాశాలను అభివృద్ధి పరచాలని కోరారు. అదేవిధంగా నూతనంగా నిర్మించిన వైద్యకళాశాల వద్ద వైద్యసిబ్బందికి క్వార్టర్స్ నిర్మించాలని, అప్పుడే ప్రజలకు అత్యవసర వైద్యసేవలు 24గంటలు అందటానికి అవకాశం ఉంటుందన్నారు. దీనికి ప్రభుత్వం చర్యలు చేపట్టాలన్నారు. ప్రజలకు అందుబాటులో తెచ్చేవిధంగా శ్రమించిన అధికారులకు ప్రజాప్రతినిధులకు సీపీఐ బృందం ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు విజయలక్ష్మి, యాదగిరి, ప్రశాంత్, వెంకట్రాములు, నర్సింహ, రాము, హజీ, మలగ్, సాయికుమార్, బాలు తదితరులు పాల్గొన్నారు.

గాలికుంటు నివారణ టీకాలు వేయించాలి



అమ్మపల్లిలో పశువులకు టీకా వేస్తున్న పశువైద్యసిబ్బంది

మాగనూర్: పశువుల కాపరులు ఉచిత గాలికుంటు వ్యాధినివారణ టీకాలను ఉపయోగించుకోవాలని వెటర్నరీ అసిస్టెంట్ శశికుమార్ సూచించారు. శనివారం మండల పరిధిలోని ఓబ్లాపూర్‌లో గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమం కొనసాగింది. ఈ మేరకు.. ఆయన మాట్లాడుతూ.. పాడి రైతులు ముందుజాగ్రత్త చర్యగా పశువులకు గాలికుంటు నివారణ టీకాల వేయించాలని సూచించారు. కార్యక్రమంలో వెటర్నరి సిబ్బంది లక్ష్మి, పశువుల కాపరులు తదితరులు పాల్గొన్నారు.

సరస్వతి ఆలయానికి విరాళం

మరికల్: మండల కేంద్రంలో నిర్మిస్తున్న సరస్వతి ఆలయ నిర్మాణం కోసం శనివారం మాజీ ఎంపీటీసీ సభ్యురాలు సూరిటి సుజాత విరాళం అందజేశారు. ఆలయ నిర్మాణ పనులు చివరి దశకు చేరుకోవడంతో మిగిలిన పనులు పూర్తిచేసేందుకు తమ వంతు సాయంగా ఆలయ కమిటీ సభ్యులు దుబాయ్ రాములుకు విరాళం అందజేసి భక్తిని చాటుకున్నారు. మరింతమంది దాతలు ముందుకొచ్చి ఆలయ పనులకు సహకారం అందించాలన్నారు. కార్యక్రమంలో నాగన్న, శ్రీను పాల్గొన్నారు.



విరాళం అందజేస్తున్న మాజీ ఎంపీటీసీ సభ్యురాలు

ప్రకృతిని అమ్మలా చూసుకోవాలి



మక్తల్‌లో అవగాహన సదస్సులో మాట్లాడుతున్న లక్ష్మారెడ్డి

మక్తల్/కృష్ణా/మాగనూర్: ప్రకృతిని అమ్మలా చూసుకోవాలని కౌన్సిల్ ఫర్ గ్రీన్‌రెవల్యూషన్ ఫౌండర్ లక్ష్మారెడ్డి అన్నారు. శనివారం మక్తల్ పట్టణంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో అవగాహన కల్పించారు. ఈ మేరకు ఆయన మాట్లాడారు.. భావి తరాలకు ప్రకృతిని కాపాడాల్సిన బాధ్యత పిల్లలపై ఉందన్నారు. మనం మట్టి, గాలి, నీటికి నిత్యం సంబంధం కలిగి ఉన్నామని అన్నారు. ఇవి లేకపోతే మానవుడి మనుగడ లేదని మొక్కల రక్షణ, నీటి నిల్వచేయడం వంటి పలు అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సంస్థ బృందం పాలడుగు నరేష్, జైపాల్, రాజేశ్వరి, మెంటర్, రవి పాల్గొన్నారు.

- కృష్ణా మండలంలోని కున్సి ఉన్నత పాఠశాలలో స్కూల్ ఎర్త్ క్లబ్ లీడర్స్‌పై ఫౌండర్ లక్ష్మారెడ్డి విద్యార్థులకు అవగాహన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు.. ప్రధానంగా పర్యావరణ, భూమాత పరిరక్షణ తదితర అంశాలపై వివరించారు. అనంతరం పాఠశాల ఆవరణలోని ఓ పురాతన చెట్టుకు మదర్ ట్రీ అని నామకరణం చేయడంతోపాటు ఆ చెట్టుకు పూజ నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం సంతోషి, గ్రామ మాజీ ఉప సర్పంచ్ నల్లె నర్సప్ప, ఉపాధ్యాయులు నరేందర్, నర్సింహులు, రమేష్, ఖాసీం ఆలీ, ఉషా, సౌమ్య, మారెప్ప, నాగేష్, రియాజ్ పాల్గొన్నారు.
- మాగనూర్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రభుత్వ విద్యాశాఖ ఆధ్వర్యంలో స్కూల్ ఎర్త్ క్లబ్ లీడర్స్‌పై విద్యార్థులకు ఇద్దరి చొప్పున స్కూల్ ఎర్త్ క్లబ్‌గా ఎన్నుకుని కమిటీలు వేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంఈఓ మురళీధర్‌రెడ్డి, ఉపాధ్యాయులు బాబు, వెంటకస్వామి, ఉపాధ్యాయుల బృందం పాల్గొన్నారు.

జీతాల ప్రక్రియలో ఆటంకం లేకుండా చూడాలి



నారాయణపేట రూరల్: జిల్లాలో విధుల్లోకి చేరిన కొత్త టీచర్లకు ఎలాంటి ఆటంకం లేకుండా సమయానికి జీతాలు అందేవిధంగా అవసరమైన చర్యలు చేపట్టాలని తపస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శేర్‌కృష్ణారెడ్డి, నర్సింహా కోరారు. శనివారం సాయంత్రం జిల్లా ట్రెజరీ కార్యాలయంలో డీటీఓ హరిప్రసాద్‌ను కలిసి నూతన ఉపాధ్యాయుల జీతభత్యాల సమస్యలపై చర్చించారు. అయితే రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 9న ఆర్డర్లు ఇచ్చి 10నుంచి విధుల్లో చేరాలని సూచించగా వారు సంబంధిత మండల విద్యాశాఖ అధికారితో కలిసి డ్యూటీలో చేరారు. అయితే పాఠశాలలు 15న ప్రారంభం కావడంతో వారికి ఇచ్చిన సర్క్యూలర్‌లో తేదీ తేడా ఉండటంతో ఆ సమస్య పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు అశోక్ కుమార్, రవికుమార్ పాల్గొన్నారు.

మై భారత్ డైరీ ఆవిష్కరణ



మక్తల్: మండలంలోని మంతన్‌గోడ్‌లో ప్రాథమిక పాఠశాలలో నెహ్రూ యువజన సంఘం ఆధ్వర్యంలో శనివారం మై భారత్ డైరీని ఆవిష్కరించి విద్యార్థులకు అందజేశారు. ఈ మేరకు.. కో- ఆర్డినేటర్ అనిల్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ.. ప్రతి యువకుడు స్వచ్ఛతపై అవగాహన కలిగి ఉండాలని అన్నారు. కార్యక్రమంలో పాఠశాల విద్యార్థులు, యువజన సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

'మా టీచర్లు మాకే కావాలి'

నారాయణపేట రూరల్: మండలంలోని పిల్లిగుండ్ల తండా పంచాయతీ పాతతండా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు శంకరప్ప, కురుమూర్తి ఇటీవల జరిగిన బదిలీల్లో వారు మరో పాఠశాలను ఎంపిక చేసుకున్నారు. అయితే వారిని రిలీవ్ చేయక పోవడంతో కొంతకాలం అక్కడే విధులు నిర్వహిస్తూ ఉన్నారు. అయితే 2024డీఎస్సీ ద్వారా ఎంపికైన కొత్త టీచర్లు అక్కడికి రావడంతో వారిని మండల విద్యాశాఖ అధికారి శనివారం రిలీవ్ చేశారు. అయితే గ్రామస్తులు వారిని వెళ్లొద్దని విజ్ఞప్తి చేశారు. పిల్లలు సైతం ప్లకార్డులు పట్టుకుని పాఠశాల బయట కూర్చొని నిరసన వ్యక్తం చేశారు.



ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థులు

ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి

- కలెక్టర్ సిక్తా పట్నాయక్



ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

మరికల్: పెండింగ్‌లో ఉన్న ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను త్వరగా పరిష్కరించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. శనివారం మండలంలోని ఆమె ఆకస్మికంగా పర్యటించారు. మండలంలోని ఆత్మకూర్ రోడ్డు వెళ్లే రహదారి పక్కన ఓ యజమాని ప్లాట్ ఎల్ఆర్ఎస్ కోసం చేసుకున్న దరఖాస్తు ప్రకారం ప్రధాన రోడ్డుకు ఎంత మేర విస్తీర్ణం ఉందనే విషయంపై కార్యదర్శిని అడిగి తెలుసుకున్నారు. ప్లాట్ల రెగ్యులరైజేషన్ కోసం యాప్‌లో ఉన్న ఎంపికలను పరిశీలించి పూర్తిచేయాలని అధికారులకు సూచించారు. ఇరిగేషన్, రెవెన్యూ, టౌన్ ప్లానింగ్ మూడు శాఖల అధికారులు ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను తీసుకెళ్లి క్షేత్రస్థాయిలో పరిశీలన చేయాలని ఆదేశించారు. ఏమైనా అభ్యంతరాలు ఉంటే నిలిపివేయాలని తెలిపారు. అలాగే మహబూబ్‌నగర్ రోడ్డు మార్గంలో 4.20 ఎకరాలలోని పలు ప్లాట్లకు సంబంధించిన దరఖాస్తుల పక్రియ ఎలా జరుగుతుందని, 30 ఫీట్ల రోడ్డు మార్గం వదిలి ఉండాలన్నారు. లేనిచో వాటిని నిలిపివేయాలని సూచించారు. మండలంలో పెండింగ్‌లో ఉన్న 1800 ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలన్నారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయాన్ని పరిశీలించారు. శాఖ పరమైన అంశాలను తహసీల్దార్ జమిల్‌ను అడిగి తెలుసుకున్నారు. నూతనంగా నిర్మిస్తున్న ఇంటిగ్రేడ్ మండల కార్యాలయ సముదాయ భవన నిర్మాణ పనులను పరిశీలించారు. పనులు తొందరగా పూర్తి చేసేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీఓ పావని, ఆర్ఐ సుధాకర్‌రెడ్డి, కార్యదర్శి శ్యామ్‌సుందర్‌రెడ్డి పాల్గొన్నారు.

వైభవంగా చౌడేశ్వరి మాత ఉత్సవాలు

ఊట్కూరు: మండలంలోని చౌడేశ్వరి మాత ఆలయంలో శనివారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో చౌడేశ్వరి మాత ఉత్సవాలను వైభవంగా ప్రారంభించారు. ఈ మేరకు.. గోశాల హనుమాన్ మందిర్ నుంచి భక్తులు కళశ శోభయాత్రను చేపట్టారు. మేళతాళాలతో శోభయాత్రను నిర్వహించారు. అమ్మవారికి అలంకరణ, ప్రత్యేక పూజలు, అన్నదానం చేపట్టారు. ఈ కార్యక్రమంలో భక్తులు గుండిం కోటప్ప, హన్మంతు, రఘువీర్, వితోభ, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



శోభయాత్రలో పాల్గొన్న మహిళలు

విద్యార్థులకు కథల పుస్తకాల పంపిణీ



పుస్తకాలను పంపిణీ చేస్తున్న ఎంపీడీఓ రహ్మతుద్దీన్

మాగనూర్: మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలను ఎంపీడీఓ రహ్మతుద్దీన్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. కలెక్టర్ సహకరంతో వచ్చిన కథల పుస్తకాలను పాఠశాల విద్యార్థులకు పంపిణీ చేశారు. అనంతరం విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని వంట నిర్వాహకులకు సూచించారు. పక్కనే ఉన్న మండల వనరుల కార్యాలయాన్ని తనిఖీచేసి, అక్కడ నుంచి నల్లగట్టు సమీపంలోని పాత మహిళ సమైక్య భవనం పరిశీలించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రాజు, దండు ఆనంద్, పంచాయతీ కార్యదర్శి తిమ్మప్ప, పాఠశాల ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

విద్యార్థులు లక్ష్యం వైపు నడవాలి

నర్వ: విద్యార్థులు పాఠశాలస్థాయి నుంచే ఓ లక్ష్యాన్ని ఎంచుకుని దానివైపు నడవాలని ఎస్ఐ కురుమయ్య అన్నారు. శనివారం పాథర్చేడ్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సామాజిక అంశాలపై అవగాహన కల్పించారు. ఈ మేరకు.. ఆయన మాట్లాడుతూ.. విద్యార్థి దశ నుంచే లీడర్స్ లక్షణాలను పెంపొందించుకోవాలన్నారు. పాఠశాల స్థాయిలో విద్యను నిర్లక్ష్యం చేస్తే జీవితాంతం కష్టపడుతూ.. బాధపడాల్సి వస్తుందన్నారు. ప్రభుత్వ పాఠశాలలో ఎక్కువగా పేద విద్యార్థులే విద్యనభ్యసిస్తారని బాగా కష్టపడి చదివితే ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చన్నారు. బాల్యవివాహాలను నివారించాలని, సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా డయల్ 100కి ఫిర్యాదు చేయాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం కృష్ణ, ఉపాధ్యాయులు సదన్ రావు, గోవిందు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్ఐ కురుమయ్య

ఉపాధ్యాయుల సంక్షేమమే ధ్యేయం



ఉపాధ్యాయులతో సభ్యత్వం చేయిస్తున్న పీఆర్టీయూ నాయకులు

నారాయణపేట రూరల్ : ఉపాధ్యాయుల సంక్షేమమే ధ్యేయంగా పీఆర్టీయూ సంఘం పనిచేస్తుందని ఆ సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు ఎం.రఘువీర్, మొల్గాన్ జనార్ధన్ అన్నారు. శనివారం మండలంలోని బండగొండ, అభంగాపూర్, అప్పిరెడ్డిపల్లి, పరిమళాపురం, శివాజీనగర్ తదితర పాఠశాలలో నూతనంగా విధుల్లో చేరిన టీచర్లను కలుసుకున్నారు. ఈ మేరకు.. వారు మాట్లాడుతూ.. ఉమ్మడి రాష్ట్రం నుంచి తెలంగాణ ఏర్పాటు తర్వాత సైతం ప్రభుత్వ, లోకల్‌బాడీ టీచర్లకు అండగా ఉండి, అన్నిరకాల సమస్యలను పరిష్కరించడంతో పీఆర్టీయూ కీలకంగా పనిచేసిందన్నారు. స్థానికంగా టీచర్లకు అవసరమైన అన్ని రకాలుగా చేదోడు, వాదోడుగా ఉంటామన్నారు. అనంతరం వారితో సభ్యత్వం చేయించారు. కార్యక్రమంలో నాయకులు జహిరోద్దిన్, నరేష్, సురేందర్, రాకేష్, శంకర్‌సింగ్, ఐశ్వర్య పాల్గొన్నారు.

